క్లుప్తంగా

దిశ కమిటీ సభ్యుడిగా బక్క శ్రీను


నియామక పత్రం అందజేస్తున్న ఎంపీ కడియం కావ్య

జనగామ రూరల్: జనగామ నియోజకవర్గం దిశ కమిటీ సభ్యుడిగా జనగామ మండలం ఎల్లంల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బక్క శ్రీనును ఎంపీ కడియం కావ్య నియమించారు. ఈమేరకు శనివారం ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. తన నియామకానికి సహకరించిన డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డితోపాటు ఎంపీలు కావ్య, చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

ధర్నాను జయప్రదం చేయాలి

తరిగొప్పుల: తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయీస్, అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ)ఆధ్వర్యంలో పంచాయతీ ఉద్యోగ, కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈనెల 27వ తేదీన తలపెట్టిన పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయం ఎదుట చేపట్టే ధర్నాను జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి నారోజు రామచంద్రం పిలుపునిచ్చారు. శనివారం జీపీ కార్మికులతో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాజకొంరయ్య, సిద్దులు, కృష్ణ, మల్లయ్య, ఎల్లయ్య, యాదగిరి, నరేష్, యాదమ్మ, స్వప్న, శ్రీను, యాకుబ్ పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నివారణకు కృషి


విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్నన్న సీఐ, ఎస్సై

పాలకుర్తి టౌన్: మాదకద్రవ్యాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పాలకుర్తి సీఐ జానకిరామ్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని సిద్దార్థ విద్యాలయంలో మాదకద్రవ్యాల నిరోధక వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు డ్రగ్స్ వాడకం వల్ల కలిగే నష్టాలపై విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అవగాహన కలిపించారు. ప్రిన్సిపాల్ జక్కుల రవీందర్, ఎస్సై దూలం పవన్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు,పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు బానిస కావద్దు

తరిగొప్పుల(నర్మెట): యువత మాదకద్రవ్యాలకు బానిస కావద్దని ఎస్సై నైనాల నగేష్ అన్నారు. మాదకద్రవ్యాల నిరోధక వారోత్సవాల్లో భాగంగా శనివారం మండలకేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు మాదకద్రవ్యాలపై అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాలకు బానిస అవడం వల్ల సమయం వృథా అవుతుందని, ఆరోగ్యం పాడవుతుందన్నారు. ఎవరైనా గంజాయి సరఫరా చేసిన, సేవించిన తక్షణమే 1908 నంబరుకు కాల్‌చేసి సమాచారం తెలియజేయాలన్నారు. ట్రెయినీ ఎస్సై రోహిత్, సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహన

చిల్పూరు: పల్లగుట్ట ఉన్నత పాఠశాలలో శనివారం హెచ్‌ఎం పెనుమాటి వెంకటేశ్వర్లు అధ్యక్షతన మాదకద్రవ్యాల నిరోధక వారోత్సవాల్లో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ట్రెయినీ ఎస్సై మహేష్, ఉపాధ్యాయులు శ్యాంరావు, సౌభాగ్యలక్ష్మి, నరసింహారావు, ప్రకాశ్, లక్ష్మి, యాకూబ్‌పాషా, అలకనంద, శోభారాణి, రమేష్, అరుణాదేవి, దేవ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

వార కల్యాణం

చిల్పూరు: బుగులు వేంకటేశ్వరస్వామి సన్నిధిలో శనివారం ఆలయ ఈఓ లక్ష్మీప్రసన్న, చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావుల ఆధ్వర్యంలో వార కల్యాణాన్ని అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యుల వేద మంత్రాల నడుమ నిర్వహించారు. భక్తులకు ఏపీలోని పల్నాడు జిల్లాకు చెందిన తేజమణి–హనుమంతరావు, సుజాతలు అన్నప్రసాద వితరణ చేశారు.

గోల్కొండ కోటలో పద్మశ్రీ సమ్మయ్య యోగా..


యోగాసనం వేస్తున్న పద్మశ్రీ సమ్మయ్య

దేవరుప్పుల: అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని హైదరాబాద్ గోల్కొండ కోటలో అప్పిరెడ్డిపల్లెకు చెందిన పద్మశ్రీ గడ్డం సమ్మయ్య యోగా కార్యక్రమంలో పాల్గొని ఆసనం వేశారు. ఈ సందర్భంగా ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా హైదరాబాద్ సర్కిల్ అధికారి డాక్టర్ ఎన్.నిహిల్ దాస్.. సమ్మయ్యను ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందించారు.

బ్రిడ్జి నిర్మాణం పూర్తయ్యేనా?

- జనగామ–హుస్నాబాద్ మధ్య రాకపోకలకు ఇబ్బందులు
- పట్టించుకోని పాలకులు, అధికార యంత్రాంగం


గానుగుపహాడ్ వద్ద నిలిచిపోయిన బ్రిడ్జి పనులు


కోతకు గురైన మట్టి రోడ్డు

జనగామ రూరల్: రెండేళ్ల క్రితం భారీ వర్షాలకు జనగామ–హుస్నాబాద్ రహదారిలో మండలంలోని వడ్లకొండ వద్ద ఉన్న బ్రిడ్జి కృంగి కూలిపోయింది. దీంతో గత ప్రభుత్వ హయాంలో బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించారు. బ్రిడ్జి మంజూరు కాగా సదరు కాంట్రాక్టర్ పనులు ప్రారంభించి పిల్లర్లు వేశారు. సంబంధిత కాంట్రాక్టర్‌కు పనులకు సంబంధించి నిధులు విడుదల కాకపోవడంతో బ్రిడ్జి నిర్మాణం నిలిపివేశారు. కాగా, గతంలో తాత్కాలికంగా వేసిన రోడ్డు గత ఏడాది రెండు సార్లు భారీ వర్షాలకు కొట్టుకు పోగా, కంకరతో మట్టి రోడ్డు వేశారు. రోడ్డు సరిగా లేకపోవడంతో అధికారులు, పోలీస్ యంత్రాంగం చిన్న వాహనాలను గానుగపహాడ్ నుంచి, వెంకిర్యాల మీదుగా భారీ వాహనాలు తరలించింది. అయితే గత మార్చి నెలలో ప్రయాణికుల ఇబ్బందిని గుర్తించి ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటి రెడ్డితో ఫోన్‌లో మాట్లాడి పెండింగ్ పనులు పూర్తి చేయాలని కోరారు. వారంలో పెండింగ్ బిల్లులు మంజూరు చేయడంతో పాటు పనులు మొదలు పెడుతామన్నారు. కానీ నేటికీ పనులు ప్రారంభించలేదు. త్వరగా నిర్మాణ పనులు పూర్తి అయితే ఎలాంటి ఇబ్బందులు ఉండవని, వర్షాలు మొదలైతే మళ్లీ ప్రజలు కష్టాలు పడాల్సి వస్తుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో వేసిన మట్టి రోడ్డు భారీ వాహనాలతో ఏర్పడిన గుంతల్లో వర్షం నీరు నిలుస్తోంది. ఇప్పటికే రోడ్డు కొంత భాగం కోతకు గురై పైపులైన్ బయటకు కనిపిస్తోంది. పాలకులు బ్రిడ్జి నిర్మాణం పూర్తిచేస్తామని చెబుతున్నారే తప్ప ఇప్పటి వరకు పనులు ప్రారంభం కావడం లేదు. దీంతో బ్రిడ్జి నిర్మాణం పూర్తయ్యేనా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

ఇబ్బందుల్లో ప్రజలు

జనగామ నుంచి నర్మెట, తరిగొప్పుల, హుస్నాబాద్ వరకు వేలాది మంది ప్రయాణిస్తుంటారు. ఆర్టీసీ బస్సుల ద్వారా వివిధ గ్రామాల నుంచి విద్యార్థులు జనగామ పట్టణానికి ఉన్నత చదువుల కోసం వస్తుంటారు. అలాగే కరీంనగర్‌కు భారీ వాహనాలలో గ్రానైట్, సరుకుల ట్రాన్స్‌పోర్ట్ అవుతుంటాయి. వీటితో పాటు నిత్యం జనగామకు గానుగపహాడ్, వడ్లకొండ, మరిగడి, ఎర్రగొల్లపహాడ్, అడవికేశాపురంతో పాటు పలు తండాల ప్రజలు ద్విచక్రవాహలపై వ్యాపారాలు చేసుకునేందుకు వస్తుంటారు. పాల ఉత్పత్తులు జనగామకు తీసుకు రావాలన్నా నిత్యం ఇబ్బంది పడాల్సి వస్తోంది. వర్షాకాలంలో భారీ వాహనాలకు అనుమతి లేక పోవడంతో గానుగపహాడ్ గ్రామం నుంచి వస్తుంటాయి. అయితే వాహనాల రాకపోకలతో ప్రజలు ప్రమాదాల బారిన పడడుతున్నారు. దీంతో పాటు దుమ్ముదూళీ ఇళ్లలోకి వస్తుండంతో దానిని పీల్చి అనారోగ్యం బారిన పడుతున్నారు. ఇదే రూట్‌లో మరో కల్వర్టు ఉండగా భారీ వహనాలతో అది కూడా దెబ్బతినే అవకాశం ఉంది. బ్రిడ్జి నిర్మాణం పనులు పూర్తి చేసి సమస్యను త్వరగా పరిష్కరించాలని వివిధ గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం



వర్షాకాలంలో గ్రామం నుంచి ఇతర గ్రామాలకు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుండటంతో రోడ్డు దెబ్బతింది. వర్షాలకు రోడ్డు కోతకు గురై ప్రమాదాలు జరుగుతున్నాయి. కలెక్టర్ పట్టించుకుని బ్రిడ్జి పనులు పూర్తి చేయించాలి.

– ఎడ్ల శ్రీనివాస్, మరిగడి

ఎక్కడ అదుపుతప్పతుందో అని భయపడుతున్నాం



గత ఏడాది బ్రిడ్జి పనులు అసంపూర్ణంగా వదిలేయడంతో తాత్కాలికంగా వేసిన మట్టి రోడ్డు కొట్టుకుపోయే పరిస్థితి ఏర్పడింది. జనగామ నుంచి తండాలకు వెళ్లాలంటే ద్విచక్ర వాహనం ఎక్కడ అదుపుతప్పుతుందో అని భయపడుతున్నాం. యుద్ధ ప్రాతిపదికన అధికారులు, ప్రభుత్వం బ్రిడ్జి పనులు పూర్తి చేసి అందుబాటులోకి తేవాలి.

– భూక్య చందు, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

ప్రభుత్వ భూమికి హద్దుల ఏర్పాటు

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని శివునిపల్లి రెవెన్యూ గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 46లోని ప్రభుత్వ భూమికి శనివారం రెవెన్యూ అధికారులు హద్దులను ఏర్పాటు చేశారు. సదరు సర్వేనంబర్‌లో రియల్టర్లు కొంత భూమిని కబ్జాచేసి పాతిన కసీలను ఆర్‌ఐలు కె.శ్రీకాంత్, సతీష్ ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది పొక్లెయినర్‌తో తొలగించి హద్దులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తే ఎంతటి వారైనా చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

నియామకం


రాజు

స్టేషన్‌ఘన్‌పూర్: బహుజన సమాజ్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా మండలంలోని తాటికొండ గ్రామానికి చెందిన నారబోయిన రాజును నియమించినట్లు బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు రాజు స్టేషన్‌ఘన్‌పూర్‌లో శనివారం విలేకరులతో మాట్లాడారు. తనపై నమ్మకంతో బీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించడం సంతోషంగా ఉందని, ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్‌కు, జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. బహుజన కులాలను ఏకం చేస్తూ పార్టీని క్షేత్రస్థాయిలో మరింతగా బలోపేతం చేసేలా శాయశక్తులా కృషి చేస్తానన్నారు.

నియోజకవర్గ ప్రగతే లక్ష్యం

- ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి


ఇళ్ల మంజూరు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే

కొడకండ్ల: నియోజకవర్గ ప్రగతే తన లక్ష్యమని, నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నిలిపి ఆదర్శంగా నిలుపుతానని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. శనివారం ఏడునూతుల, రంగాపురం, నర్సింగాపురం, రేగుల, కొడకండ్ల, రామవరం, పాకాల, మొండ్రాయి, లక్ష్మక్కపల్లి గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు నిర్వహించింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల సొంతింటి కలను సాకారం చేయడమే ఇందిరమ్మ పథకం లక్ష్యమని, ఇందుకనుగుణంగా అర్హులైన వారందరికీ ఇళ్లు మంజూరు చేయిస్తానన్నారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులకు మంజూరు పత్రాలు, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. మండల స్పెషలాఫీసర్ రవిందర్, ఎంపీడీఓ నాగేశ్వరాద్రిసూరి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సురేష్‌నాయక్, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు రాజేష్‌నాయక్ పాల్గొన్నారు.

25న కవర్ షెడ్ల ప్రారంభం

స్టేషన్‌ఘన్‌పూర్: స్థానిక వ్యవసాయ మార్కెట్ ఆవరణలో నూతనంగా నిర్మాణం చేపట్టిన బిగ్ కవర్ షెడ్‌లను ఈనెల 25వ తేదీన ప్రారంభించనున్నట్లు ఏఎంసీ చైర్‌పర్సన్ జూలుకుంట్ల లావణ్యశిరీష్‌రెడ్డి అన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్ మార్కెట్ కమిటీ కార్యాలయంలో శనివారం మార్కెట్ పాలకమండలి సాధారణ సమావేశాన్ని నిర్వహించారు. సెక్రటరీ జన్ను భాస్కర్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన చైర్‌పర్సన్ మాట్లాడారు. మార్కెట్‌లో అందిస్తున్న సౌకర్యాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బిగ్ కవర్‌షెడ్ ప్రారంభోత్సవానికి ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్లు తెలిపారు.

సంక్షేమ పథకాలు తెలిపేందుకే ‘దర్తి అబ’


మాట్లాడుతున్న రూపాదేవి

చిల్పూరు: గిరిజనులకు అందే సంక్షేమ పథకాలను తెలిపేందుకే దర్తి అబ (జనజాతీయ గ్రామం ఉత్కర్ష్ అభియాన్) కార్యక్రమం ఉద్దేశ్యమని టీడబ్ల్యూడీ (ఏటీడీఓ) రూపాదేవి అన్నారు. ఫత్తేపూర్ గ్రామం దర్తి అబ కింద ఎంపిక కాగా శనివారం గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. అనంతరం గిరిజనుల నుంచి దరఖాస్తులను తీసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శంకర్‌నాయక్, పంచాయతీ కార్యదర్శి పెళ్లి హరిప్రసాద్, డాక్టర్ అనేష్ , వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కేంద్ర నిధులతో రాష్ట్రం అభివృద్ధి

బచ్చన్నపేట: కేంద్ర ప్రభుత్వ నిధులతో రాష్ట్రం అభివృద్ధి చెందిందని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బి.సిద్దులు అన్నారు. శనివారం తమ్మడపల్లి గ్రామంలో కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలతో కూడిన కరపత్రాలను ఇంటింటికి పంపిణీ చేసి అవగాహన కల్పించారు. ప్రధాని నరేంద్ర మోదీ 11 సంవత్సరాలుగా దేశ అభివృద్ధికి కృషి చేస్తున్నారని అన్నారు. నాయకులు కొల్ల వెంకటరెడ్డి, మింట్లాపురం జలంధర్, చిరంజీవి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

సన్మానం

పాలకుర్తి టౌన్: వరంగల్ భద్రకాళి దేవస్థానం చైర్మన్‌గా నియామకమైన డాక్టర్ శివసుబ్రహ్మణ్యంను శనివారం పాలకుర్తి మండల కేంద్రానికి చెందిన తెలంగాణ బ్రహ్మణ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంగు నవీన్‌శర్మ దంపతులు సన్మానించారు.

మంత్రికి..

పాలకుర్తి టౌన్: నూతనంగా బాధ్యతలు స్వీకరించిన రాష్ట్ర ఎస్సీ అభివృద్ధి, గిరిజన, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌ను శనివారం టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమండ్ల ఝాన్సీరెడ్డి హైదరాబాద్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించి అభినందనలు తెలిపారు.

సరైన ధ్రువపత్రాలు కలిగి ఉండాలి

తరిగొప్పుల (నర్మెట): వాహన చోదకులు డ్రైవింగ్ లైసెన్స్‌తోపాటు వాహన ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని ఎస్సై నైనాల నగేష్ అన్నారు. మండలకేంద్రంలోని నర్మెట–హుస్నాబాద్ రహదారిలో శనివారం వాహనాల తనిఖీలు నిర్వహించిన ఆయన పలు సూచనలు చేశారు. ట్రెయినీ ఎస్సై పిట్టల రాజేష్, సిబ్బంది ఎండి రహమ్మత్ అలీ, గద్దె రాము, రాజు, విజయ్ కిరణ్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం

రఘునాథపల్లి: మండలంలోని లక్ష్మితండాకు చెందిన భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకుడు బానోతు చందు అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న రాష్ట్ర ప్రచార కార్యదర్శి రాసమల్ల కొమురయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 2,500 సాయంగా అందజేశారు. లింగనాయక్, కుమార్, భీమా, కాలురాం, మోహన్, రవీందర్ ఉన్నారు.

పరామర్శ

బచ్చన్నపేట: పోచన్నపేట గ్రామానికి చెందిన నిలిగొండ సత్తయ్య అనారోగ్యంతో శనివారం మృతిచెందాడు. కాగా, బీజేపీ మండల అధ్యక్షుడు బంగారు మహేష్ గ్రామానికి చేరుకుని సత్తయ్య మృతదేహానికి నివాళులర్పించి బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయన వెంట జిల్లా అధికార ప్రతినిధి సద్ది సోమిరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి గద్ద రాజు, జూకంటి గణేష్, రవీంద్రచారి, ఏల రాజశేఖర్, గద్ద శ్రీకాంత్, వెంకటేష్, దూడల సిద్దులుగౌడ్ ఉన్నారు.

సర్వీసు వైర్ల సమస్యకు పరిష్కారం

సాక్షి ఎఫెక్ట్..


సర్వీస్ వైర్ల పనులు చేస్తున్న విద్యుత్ సిబ్బంది

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని శివునిపల్లిలోని గుండయ్యమిల్లు సమీపాన ఉన్న శ్రీకృష్ణ కాలనీలో గృహాలకు విద్యుత్ సరఫరాకు సంబంధించిన సర్వీసు వైర్లు కిందికి వేలాడుతూ ప్రమాదరకంగా ఉండటంతో కాలనీవాసులు పడుతున్న అవస్థలపై ఈనెల 15న వేలాడుతున్న సర్వీసువైర్లు శీర్షికన సాక్షిలో వచ్చిన కథనానికి ఎట్టకేలకు విద్యుత్ అధికారులు స్పందించారు. విద్యుత్ శాఖ స్టేషన్‌ఘన్‌పూర్ డీఈ రాంబాబు ఆదేశాల మేరకు విద్యుత్ సిబ్బంది శనివారం కాలనీకి చేరుకుని సదరు సమస్యను పరిష్కరించారు. లైన్‌మన్ గబ్బెట సుధాకర్ ఆధ్వర్యంలో విద్యుత్ సిబ్బంది కాలనీలో ప్రమాదకరంగా కిందికి వేలాడుతున్న సర్వీసువైర్లను తొలగించారు. 40 మీటర్ల దూరంలో ఉన్న పాత ట్రాన్స్‌ఫార్మర్ నుంచి తొలగించి ఇటీవల నూతనంగా వేసిన విద్యుత్‌పోల్‌ల లైన్ నుంచి సర్వీసులను అందించారు. వేలాడుతున్న సర్వీసు వైర్లను తొలగించి కొత్తగా వేసిన లైన్‌నుంచి కనెక్షన్లు అందించడంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తమ కాలనీలో నెలకొన్న విద్యుత్ సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్లేలా ప్రత్యేక కథనం ప్రచురితం చేసిన సాక్షి దినపత్రికకు, తమ సమస్యలపై సానుకూలంగా స్పందించి పరిష్కరించిన విద్యుత్ శాఖ అధికారులకు, సిబ్బందికి కాలనీవాసులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో లైన్‌మన్ గబ్బెట సుధాకర్, ఏఎల్‌ఎం మరిపెల్లి వెంకటేష్, కట్టర్‌లు గుర్రం సురేష్, రాజు, కాలనీవాసులు పోశాల క్రిష్ణమూర్తిపటేల్, పాలకుర్తి కిష్టు, శనబోయిన నాగేష్, గుర్రాల శ్రావన్ పాల్గొన్నారు.

బాధితులకు నష్టపరిహారం చెల్లించాలి


కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న బాధితులు

జనగామ రూరల్: జనగామ నుంచి దుద్దెడ వరకు నిర్మిస్తున్న జాతీయ రహదారికి ఏకశిలా పెట్రోల్ పంపు పరిసర ప్రాంతాల్లో ఇళ్ల ప్లాట్ల స్థలం కోల్పోతున్న బాధిత యజమానులకు డాక్యుమెంట్ పొజిషన్ కబ్జా ఆధారంగా నష్టపరిహారం చెల్లించాలని బూడిద గోపి అన్నారు. శనివారం ప్లాట్ల యజమానులు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ 30 సంవత్సరాల క్రితం రైతులు, కార్మికులు, వ్యవసాయ కూలీలు, చిరు వ్యాపారులు, ప్రైవేట్ గుమస్తాలు కాయకష్టం చేసుకుని జనగామలో ప్లాట్లు కొనుగోలు చేశారని, ఆ సమయంలో డిజిటల్ సర్వేలు, లేఅవుట్ ప్లాన్‌తో లేవన్నారు. జాతీయ రహదారికి పోతున్న స్థలం రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్‌లో ఉన్న సర్వే నంబర్‌కు ఫిజికల్ సర్వే నంబర్‌కు మ్యాచ్ కావడం లేదన్నారు. కేవలం ఫిజికల్ పొజిషన్ ఆధారంగా నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలన్నారు. పి.జగన్మోహన్ రావు, ఎన్.ఉపేందర్ రెడ్డి, జి.తిరుపతిరెడ్డి, వీరయ్య, ఎండీ జావిద్, రమావత్ మహేందర్, అవధూత వెంకటేశ్వర్లు, యేలా జనార్దన్, చిదంబరం చంద్రయ్య, వెంకటేష్ పాల్గొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత

సాక్షి నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యోగా ఆసనాలు వేసి, శ్వాస పద్ధతులు నిర్వహించారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ ప్రతిరోజూ యోగా సాధన చేయడం ద్వారా శారీరక ఉత్తేజంతోపాటు మానసిక ప్రశాంతత, సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని అన్నారు. ఆయా కార్యక్రమాల్లో అధికారులు, నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జనగామ: సెయింట్ పాల్స్‌లో..



జనగామ: వివేకానంద సేవా సమితి ఆధ్వర్యంలో..



జనగామ రూరల్: అరబిందో పాఠశాలలో..



స్టేషన్‌ఘన్‌పూర్: ఛాగల్లు జెడ్పీఎస్‌ఎస్‌లో..




జనగామ: అగాపే గుడ్ షెఫర్డ్ స్కూల్‌లో యోగా డే అక్షర క్రమంలో విద్యార్థులు


జనగామ రూరల్: జిల్లా కోర్టులో యోగా చేస్తున్న సీనియర్ సివిల్ జడ్జి సి.విక్రమ్ తదితరులు


జనగామ: ఏకశిల పబ్లిక్ స్కూల్‌లో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు


జనగామ: పెంబర్తి ఎంజేపీపీలో వేద ఆయుర్వేద ఆస్పత్రి డాక్టర్ అంజిరెడ్డిని సత్కరిస్తున్న అధ్యాపకులు


లింగాలఘణపురం: కస్తూర్బా గాంధీ పాఠశాలలో..


తరిగొప్పుల: కేజీబీవీలో..


తరిగొప్పుల(నర్మెట): ఆదర్శ పాఠశాలలో..


బచ్చన్నపేట: యోగాసనాలు వేస్తున్న వైద్యులు


కొడకండ్ల: పీహెచ్‌సీలో..


దేవరుప్పుల: మాధాపురం పాఠశాలలో యోగా చేయిస్తున్న పిరమిడ్ మాస్టర్ సత్యనారాయణ


జనగామ రూరల్: బతుకమ్మకుంటలో యోగాసనాలు వేస్తున్న బీజేపీ నాయకులు


పాలకుర్తి టౌన్ బీజేపీ ఆధ్వర్యంలో..


జఫర్‌గఢ్: కూనూర్ పాఠశాలలో..

దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలి


సమీక్ష నిర్వహిస్తున్న ఆర్డీఓ

జఫర్‌గఢ్: భూ భారతి దరఖాస్తుల విషయంలో వాస్తవాలను పరిగణలోకి తీసుకుని క్షేత్రస్థాయిలో పరిశీలించాలని స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీఓ డీఎస్ వెంకన్న అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో భూభారతిపై అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. రెవెన్యూ సదస్సుల్లో స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించి వేగంగా పరిష్కరించాలని అన్నారు. తహసీల్దార్ శంకరయ్య, నాయబ్ తహసీల్దార్ అనిల్‌బాబు, ఆర్‌ఐలు పాల్గొన్నారు.

సతీష్ మృతి తీరనిలోటు

దేవరుప్పుల: ఎమ్మార్పీఎస్ దేవరుప్పుల మాజీ అధ్యక్షుడు జోగు సతీష్ అకాల మృతి తీరనిలోటని ఆ విభాగం మండల అధ్యక్షుడు పడమటింటి నర్సింహ అన్నారు. శనివారం మండల కేంద్రంలో సతీష్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు సుందరామిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు దయాకర్, కొల్లూరి సోమన్న ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

కేసు నమోదు

దేవరుప్పుల: మండల కేంద్రానికి చెందిన జోగు సతీష్ శుక్రవారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న విషయమై తండ్రి యాదగిరి ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఊర సృజన్‌కుమార్ తెలిపారు. మండల కేంద్రానికి చెందిన జోగు సతీష్‌కు ఇదే మండలం కామారెడ్డిగూడెంకు చెందిన నర్మదతో వివాహం జరిగింది. వీరికి ముగ్గులు పిల్లలు జన్మించగా మృతుడు సరిగా పనిచేస్తలేదని భార్య తరుచూ గొడవ పడేదని, దీంతో తన కొడుకు సతీష్ మనస్థాపంతో ఆత్మహత్యకు పాల్పడినట్టు మృతుడి తండ్రి యాదగిరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై పేర్కొన్నారు.

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
కె. మల్లేశ్ (S.R) : 9849921793 (జనగామ)
ఎన్. అనిల్ (S.R) : 9949363827 (పాలకుర్తి)
ఎల్. అనిల్ (S.R) : 8074977328 (స్టే॥ ఘన్‌పూర్)